క్లుప్తంగా

ఉచిత కంటి వైద్యశిబిరం రేపు

రేపల్లె: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సహకారంతో డాక్టర్ వేజల్ల ప్రకాశరావు జ్ఞాపకార్థం మంగళవారం గుత్తికొండ లక్ష్మీనారాయ కల్యాణ మండపంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంసీఏ అధ్యక్షులు కె.రత్నాకర్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేయనున్నామని అన్నారు. ఆపరేషన్లకు ఎంపికైన వారికి శంకర కంటి ఆసుపత్రి పెదకాకానిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని తెలియజేశారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

కో-ఆప్షన్ మెంబరు మృతికి నివాళులు



వేమూరు: తలతోటి సువర్ణరాజు పార్టీకి ఎనలేని సేవలు అందించారని వేమూరు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు తెలిపారు. మండల పరిషత్ కో–ఆప్షన్ మెంబరు అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన భౌతికకాయానికి అశోక్‌బాబు ఆదివారం నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దాది సుబ్బారావు, ఎంపీపీ యల్లమాటి మోహనరావు, దున్నా మేరీసుబాబు, గుమ్మడి దానియేలు తలతోటి జిగిన్‌బాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మకరతోరణం అందజేత



పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వ్యాఘ్రపుర క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన పెదపులివర్రు గ్రామ పరిధి గాజులపేటలో కొలువైన శ్రీ అభయాంజనేయస్వామికి మకర తోరణం అందజేశారు. చెరుకుపల్లి మండలం గుళ్లపల్లికి చెందిన చెన్ను కోటేశ్వరరావు–శివమ్మ దంపతులు ఆదివారం స్వామి వారికి ఇత్తడి మకరతోరణం సమర్పించారు. వారి తరఫున చెన్ను వీరాంజనేయులు–హిమబిందు దంపతులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదబ్రాహ్మణులు ఆమంచి సృజన్ కుమార్ శాస్త్రోక్తంగా సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పని చేస్తే గుర్తింపు



బాపట్ల: ఉద్యోగంలో అంకిత భావంతో పని చేస్తేనే మంచి గుర్తింపు లభిస్తోందని ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పి.నాగేశ్వర రావు పేర్కొన్నారు. జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగ విరమణ చేస్తున్న మోటా పద్మావతి సన్మాన సభ స్థానిక ఎన్జీవో హోమ్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్జీవో జిల్లా అధ్యక్షులు పి.నాగేశ్వర రావు మాట్లాడుతూ.. ఏఎన్ఎంగా ఉద్యోగం పొంది అంచలంచెలుగా ఎదిగి జిల్లా అధికారి క్యాడర్‌కు చేరుకున్న పద్మావతి ఆరోగ్య రంగంలో విశేష సేవలు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్‌వో విజయమ్మ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

కూల్ డ్రింక్ షాపులో చోరీ

కర్లపాలెం: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఎదురుగా ఉన్న కూల్ డ్రింక్ షాపులో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. కర్లపాలెం ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం గుర్తు తెలియని ఓ యువకుడు కూల్ డ్రింక్ షాపునకు వచ్చి డ్రింక్స్ కావాలని అడగడంతో షాపు యజమాని లోపలకు వెళ్లారు. అదే అదునుగా భావించిన ఆ యువకుడు గల్లా పెట్టె తెరచి అందులో ఉన్న రూ.35 వేల నగదు తీసుకుని పారిపోయాడు. యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

నేటి నుంచి మరమ్మతుల పనులు

తెనాలి టౌన్: ప్రత్తిపాడు 220 కేవీ సబ్ స్టేషన్‌లో 160 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మెయింటెనెన్స్ పనులు సోమవారం నుంచి ఈనెల 9వ తేదీ మంగళవారం వరకు జరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఆపరేషన్ తెనాలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ చిరంజీవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ కారణంతోనైనా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వినియోగదారులు గమనించి డిపార్ట్‌మెంట్‌కు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

అడుగుకో గుంత.. తీరేనా చింత!

- అధ్వానంగా ప్రధాన రహదారులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- వాహనదారులకు తప్పని వెతలు



తటాకాన్ని తలపిస్తున్న నిజాంపట్నం ప్రధాన రహదారి

రేపల్లె: పాలకుల అలసత్వం.. అధికారుల నిర్లక్ష్యం వెరసి ప్రజల పాలిట శాపాలుగా మారుతున్నాయి. రేపల్లె నియోజకవర్గంలోని ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. రహదారులపై అడుగుకో గుంత దర్శనమిస్తోంది. ఈ గుంతల దారులపై ప్రయాణమంటే ప్రజలకు వెన్ను వణుకుతుంది. రోడ్లు ఛిద్రం కావడంతో ప్రయాణానికి వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. దీంతో వాహనచోదకులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేపల్లె–నిజాంపట్నం ప్రధాన రహదారి తీవ్రంగా దెబ్బతింది. దారి పొడవునా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నామని వాహనచోదకులు వాపోతున్నారు.

నత్తనడకన నిర్మాణ పనులు..

రేపల్లె–నిజాంపట్నం ప్రధాన రహదారిపై నిజాంపట్నం, కూచినపూడి, పల్లపట్ల, శింకపాలెం, యేమినేనివారిపాలెం, ఆముదాలపల్లి తదితర గ్రామాల నుంచి నిత్యం వందల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో పాటు నిజాంపట్నం హార్బర్ నుంచి మత్స్య సంపదను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఈ రహదారే ప్రధాన రవాణా మార్గం. ప్రస్తుతం ప్రారంభమైన రహదారి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. రహదారిపై ఏర్పడ్డ గుంతల్లో చిన్నపాటి వర్షానికి నీరు చేరడంతో తటాకాలను తలపిస్తున్నాయి.

ప్రయాణికుల ఇబ్బందులు..

రేపల్లె మండలంలోని పెనుమూడి–లంకెవానిదిబ్బ ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఈ రహదారిలో అడుకో గుంత ఏర్పడి ప్రయాణం అత్యంత ప్రమాద భరితంగా సాగుతోంది. ఈ రహదారిలో నిత్యం చోడయపాలెం, పిరట్లంక, చెన్నుపల్లివారిపాలెం, విశ్వేశ్వరం, మోర్తోట, కనకాలవారిపాలెం, చాటగడ్డ, మైనేనివారిపాలెం గ్రామాల నుంచి వందల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. రహదారి అధ్వానంగా ఉండడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు.



అధ్వానంగా పెనుమూడి–లంకెవానిదిబ్బ రహదారి

ఎన్నికల ముందు ఊకదంపుడు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు రహదారి అభివృద్ధిపై ఇప్పటి వరకూ నోరు మెదపకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీసం మరమ్మతులకు కూడా నోచుకోని గుంతల రహదారులు నియోజకవర్గంలో కోకొల్లలు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

వెళ్లి రావయ్యా.. ఏకదంతుడా



వలివేరు గ్రామోత్సవంలో పాల్గొన్న వరికూటి అశోక్‌బాబు



కొల్లూరులో నృత్య ప్రదర్శన..



గణనాథుడి పూజల్లో హేమశంకరరావు

- ఘనంగా గణపతి నిమజ్జనాలు
- గంగమ్మ ఒడికి గౌరీపుత్రుడు

చుండూరు(వేమూరు): వినాయకుని ఆశీస్సులు ప్రతి కుటుంబానికి ఉండాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు తెలిపారు. చుండూరు మండలంలోని చినపరిమి, వలివేరు గ్రామాల్లో వినాయక చవితి వేడుకల్లో ఆదివారం ఆయన పాల్గొన్నారు. విగ్రహాలను తుంగభద్ర కాలువల్లో నిమజ్జనం చేశారు. లడ్డూల వేలం పాటను నిర్వహించారు. ఊరేగింపు కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలోని గ్రామాల్లో గణపతి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. 5వ రోజు ఆదివారం వినాయకుని విగ్రహ ఊరేగింపు వేడుకలను ఆయా గ్రామాల ప్రజలు వైభవంగా నిర్వహిస్తున్నారు. స్వామి వారి లడ్డూను అత్యధికంగా భక్తులు వేలంలో దక్కించుని నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. మండలంలోని వెల్లటూరు కట్లమ్మ తల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన మహోత్సవంలో వేములపల్లి రవి కిరణ్, డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, సర్పంచి బొజ్జా రవిలు పాల్గొన్నారు. వినాయకుడి ఉత్సవాలలో భాగంగా విద్యార్థులకు వినాయక చవితి ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు గుర్రం మురళీమోహన్ తెలియచేసి క్విజ్ కార్యక్రమం నిర్వహించారు. సమర సమత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు ఐలవరంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

కోలాహలంగా ఊరేగింపు..

కొల్లూరు: వినాయక నిమజ్జనోత్సవాలతో మండలంలో కోలాహల వాతావరణం నెలకొంది. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో గణనాథుని విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. తొలుత లడ్డూ వేలం పాట నిర్వహించారు. మండపాల వద్ద ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నాలుగు విగ్రహాలకు ఆదివారం ఊరేగింపు, అన్నదానం కార్యక్రమాలను నిర్వహించారు. ఎస్.రంజిత్ రెడ్డి స్వామి ప్రసాదమైన లడ్డూను రూ.90 వేలకు వేలంలో దక్కించుకున్నారు.

కర్లపాలెం: భక్తులు అత్యంత వైభవంగా ఆదివారం వినాయక నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు. కర్లపాలెం మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఐదు రోజులుగా పూజలందుకున్న వినాయకుని లడ్డూను కమిటీ సభ్యులు వేలం నిర్వహించారు. మంజూష మెడికల్ స్టోర్ ప్రొప్రైటర్ బొమ్మిశెట్టి మదన్‌మోహన్ దంపతులు రూ.75 వేలకు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు. పెదపులుగువారిపాలెం గ్రామంలో స్వామివారి లడ్డూను వేలంలో పులుగు వెంకటరెడ్డి రూ.14 వేలకు పాడుకున్నారు.

అన్నదానం కార్యక్రమంలో ఎమ్మెల్యే..

వేమూరు: వినాయక చవితి వేడుకల్లో భాగంగా వేమూరు మండల కేంద్రంలోని ఎన్టీఆర్ పుర వేదిక వద్ద ఆదివారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. వినాయకుని ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆయన కోరారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



వేలంలో లడ్డూ దక్కించుకున్న మదన్‌మోహన్ దంపతులు

ఘనంగా డాక్టర్ ప్రజ్ఞాచారికి సత్కారం

తెనాలి టౌన్: గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక, సంస్కృతిక సౌజన్యంతో తెలుగు భాషా సాహితీ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో ఆగస్టు 29, 30, 31 తేదీల్లో నెల్లూరు టౌన్ హాల్‌లో నిర్వహించిన తెలుగు భాషా ఉత్సవాలకు తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన సాహితీ రత్న డాక్టర్ పూర్ణ ప్రజ్ఞాచారికి ఆహ్వానం అందింది. ఈ ఉత్సవాల్లో ప్రజ్ఞాచారి పాల్గొని 'లలితా విభూషిత తెలుగు పదము' అను శీర్షికతో పద్య పఠనం చేశారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన తిరుపతి వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, విశ్రాంత ఉప కులపతి, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ విచ్చేసి ప్రజ్ఞాచారి పద్య పఠానాన్ని విని అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రజ్ఞాచారి మాట్లాడారు. నేటి కాలంలో తెలుగు ఉన్నత స్థితిని ప్రస్తావిస్తూ 'తెలుగు విలపం' అనే పద్యకావ్యం రాసినట్లు పేర్కొన్నారు. దీని వల్ల తెలుగు భాషోత్సవాల్లో పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ వంటి మహనీయుల చేత సత్కారం లభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.



ప్రజ్ఞాచారిని సత్కరిస్తున్న పద్మశ్రీ ఇనాక్

వైభవంగా భాగవత సప్తాహ మహోత్సవం



కొల్లూరు: భాగవత సప్తాహ మహోత్సవ వేడుకలను ఆదివారం కొల్లూరులో వైభవంగా నిర్వహించారు. 109వ శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞ మహోత్సవంలో భాగంగా స్థానిక శ్రీ శంకర సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక శ్రీ పార్వతీ సంస్కృత పాఠశాల ఆధ్యాత్మిక మండపంలో సప్తాహ శ్రవణ కార్యక్రమాలు చేపట్టినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కొల్లూరులో 1917లో ప్రారంభమైన ఈ సప్తాహ శ్రవణ కార్యక్రమాలను సోమవారం నుంచి ఈనెల 7 ఆదివారం వరకు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలలో భాగంగా ఆదివారం ప్రవచకులు తంగిరాల రాజేంద్రప్రసాద్ నిర్వహించిన భాగవత పారాయణాన్ని భక్తులు ఆలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మెరుగైన పరిపాలన అందించడమే లక్ష్యం

మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి టౌన్: ప్రజలకు మెరుగైన సేవలందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. రూరల్ మండలం కఠెవరం, పినపాడు గ్రామాల్లో ఆదివారం పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో కొత్త స్మార్ట్ కార్డుల పంపిణీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి మనోహర్, సబ్‌కలెక్టర్ సంజనా సింహా పాల్గొని రేషన్ లబ్ధిదారులకు నూతన స్మార్ట్ కార్డులను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే లబ్ధిదారుల వివరాలు వెంటనే తెలుస్తాయని అన్నారు. గతంలో కంటే మెరుగైన సులభతరమైన సేవలు ఈ కార్డుతో అందుతాయని తెలిపారు. సబ్‌కలెక్టర్ సంజనా సింహా మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది, డీలర్లు ఇంటింటికీ వచ్చి కొత్త కార్డులు ఇస్తారని వివరించారు. కార్యక్రమంలో కఠెవరం సర్పంచి బండికళ్ల ప్రసాద్, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో అత్తోట దీప్తి, డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్, ఆర్ఐ జాన్, సీడీపీవో విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.



కఠెవరం కార్యక్రమంలో మంత్రి మనోహర్, సబ్‌కలెక్టర్ సంజనా సింహా

తెనాలి ఇన్‌చార్జి కమిషనర్‌గా శ్రీకాంత్



తెనాలి అర్బన్: తెనాలి మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా పి.శ్రీకాంత్‌ను నియమించారు. ఈ మేరకు మున్సిపల్ డైరెక్టర్ పి.సంపత్‌కుమార్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. శ్రీకాంత్ మున్సిపల్ ఇంజినీరింగ్ తెనాలిలో పనిచేస్తున్నారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన ఎంవీ లక్ష్మీపతిరావు ఆదివారం పదవీ విరమణ చేయడంతో శ్రీకాంత్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గుండెపోటుపై అవగాహన రేపు

తెనాలి: వాకర్స్ క్లబ్, తెనాలి సమావేశంలో మంగళవారం గుండెపోటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నామని క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం ఆదివారం తెలిపారు. కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో సాయంత్రం 5.30 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. డీవీసీ హాస్పటల్ హృద్రోగ నిపుణుడు డాక్టర్ వై.రామ్‌కిషోర్ కార్యక్రమంలో పాల్గొని 'గుండెపోటుకు కారణాలు.. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు' అంశంపై ప్రసంగించనున్నారు.

మానసిక ప్రశాంతతకు యోగా దోహదం

బాపట్ల అర్బన్: యోగా మానసిక ప్రశాంతతకు దోహదపడుతోందని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ డాక్టరు బి.శరత్ పేర్కొన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, మహిళా సమైఖ్య ఆధ్వర్యంలో బాపట్ల పట్టణంలో ఆదివారం యోగాపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను చైర్మన్ డాక్టరు బి.శరత్ తెలియజేశారు. యోగాతో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం పొందాలని సూచించారు. పంగులూరి హరిప్రసాద్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని సూచించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి గురజాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఫారెస్ట్ డిపార్టుమెంట్ సహకారంతో పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతూ, పర్యావరణ అభివద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మహిళా సమైఖ్య అధ్యక్షురాలు కోలా పద్మజ, సంస్థ గౌరవ అధ్యక్షులు వంకాయలపాటి హరిబాబు, కోశాధికారి సీహెచ్ కేశవులు, జాయింట్ సెక్రెటరీ సూరిబాబు, ఆర్ట్స్ కాలేజీ రిటైర్డ్ అధ్యాపకులు జి.శాంతారామ్, కరణం రవీంద్రబాబు, సంస్థ సభ్యులు తోట రామాంజనేయులు, కోలా సుబ్బారావు, ఎం.ప్రసన్నాంజనేయులు, సింగారావు, మంజులత, శ్రీలక్ష్మీ, అనంత కుమారి, మహిళా సమైఖ్య సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టరు శరత్

ఉపాధ్యాయుడికి తెలుగు భాషా పురస్కారం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులుగా పని చేస్తున్న గుర్రం మురళీమోహన్ ఆదివారం నరసరావుపేటలో భువన చంద్ర టౌన్ హాల్‌లో శ్రీ కళా వేదిక తెలుగు భాషా దినోత్సవ సంబరాల్లో భాగంగా పురస్కారాన్ని అందుకున్నారు. కళావేదిక మేనేజింగ్ డైరెక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరి భూషణం చేతుల మీదగా పురస్కారాన్ని స్వీకరించారు. తెలుగు భాషా తెలుగు వైభవం, తెలుగు పాటలు, ప్రతి సాంప్రదాయాల అభివృద్ధి, వివిధ రంగాల ద్వారా చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును అందించారని మురళీమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఎంఈవోలు పులి లాజర్, నీలం దేవరాజు, ప్రధానోపాధ్యాయురాలు కె.అరుణకుమారి, సహ ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో రామారావు, హరిప్రసాద్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాన్ని మురళీమోహన్‌కు అందజేస్తున్న నిర్వాహకులు

మండల పరిషత్ కార్యాలయం.. అపరిశుభ్రం

కొల్లూరు: ప్రభుత్వ కార్యాలయాలు అపరిశుభ్ర వాతావరణానికి నిలయంగా మారుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించని అధికారులు స్వచ్ఛాంధ్రా.. స్వర్ణాంధ్ర పేరుతో నామమాత్రంగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారనడానికి కొల్లూరు మండల పరిషత్ కార్యాలయం నిదర్శనం. మండల పరిషత్ కార్యాలయ ఆవరణ పిచ్చిమొక్కలతో చిట్టడవిని తలపిస్తుంది. కార్యాలయం వెలుపలి గేటు వైపున నెలలు తరబడి వేసిన వ్యర్థాలు దుర్వాసనతో నిండిపోయాయి. కార్యాలయ దుస్థితిని చూసి కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు ముక్కున వేలు వేసుకుంటున్నారు. మండల అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన మండల పరిషత్ అధికారులు మండల కార్యాలయంలో పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



కార్యాలయం గేటు వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

ఆహారం, వ్యాయామం ఎంతో అవసరం

తెనాలి: మనిషి జీవనశైలిలో ఆహారం, వ్యాయామం ప్రత్యేకించి ముఖ్యమైనవని డాక్టర్ డి.శారద అన్నారు. ప్రతినెలా చివరి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని బుర్రిపాలెం రోడ్డులోని ఎస్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేశారు. డి–3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, బీఎంఐ పరీక్షలు నిర్వహించి రోగులకు అల్పాహారం అందించారు. డాక్టర్ శారద మాట్లాడుతూ.. షుగర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని, కాళ్లకు పుండ్లు పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మనిషి జీవనశైలిలో చేసుకోవాల్సిన మార్పులు ప్రత్యేకించి ఆహారం, వ్యాయామం వంటి విషయాలను తెలియజేశారు. శిబిరంలో కొందరికి ఈసీజీ, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. రోగులకు నెలకు సరిపడా అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శారద

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన జవహర్‌బాబు

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి అర్బన్: అనేక మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా జవహర్‌బాబు తీర్చిదిద్దారని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. రేపల్లెలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన బిళ్లా జవహర్ బాబు అభినందన సభను ఎస్‌వీఆర్ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 37 ఏళ్ల అధ్యాపకునిగా ఎంతోమంది అభ్యున్నతికి కృషి చేశారని అన్నారు. అనంతరం జవహర్‌బాబు, కె.సమతావాణి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు బి.రాహుల్ బాబు, ఆర్.ప్రియాంక, పృథ్వీ, జెడ్.ఎస్.రామచంద్రరావు, బీవీ నరసింహారావు, జుబేర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి

గుండెజబ్బులపై అప్రమత్తంగా ఉండాలి

తెనాలి టౌన్: వృద్ధాప్యంలో వచ్చే గుండె జబ్బులు, కీళ్ల నొప్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మైత్రీ హాస్పటల్ వైద్యులు డాక్టర్ ఆలపాటి కృష్ణ సందీప్ సూచించారు. స్థానిక కవిరాజా పార్కులోని సీనియర్ సిటిజన్స్ అసోసియేన్ హాల్‌లో ఆదివారం ఆగస్టు నెల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభకు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా సందీప్ పాల్గొని వృద్ధాప్యంలో వచ్చే గుండె జబ్బులు, కీళ్ల నొప్పులు, షుగర్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అబ్బూరు రామమూర్తి, కొరటాల ఈశ్వర్ ప్రసాద్, అజ్గర్ అలీ, పి.పూర్ణచంద్రరావు, టి.కోటిరెడ్డి, చలమయ్య, కె.రామకృష్ణారావు, చెరుకూరు శివరామయ్య, పాల్గొన్నారు. అనంతరం సందీప్‌ను సత్కరించారు.

